సాక్షి
పల్నాడు
శుక్రవారం । 24 । మే । 2024



లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల

నకరికల్లు:స్థానిక ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనర్సింహస్వామి తిరునాళ్ల మహోత్సవం గురువారం నిర్వహించారు. విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.



ఈశ్వరుడికి విశేష పూజలు

తెనాలిరూరల్: తెనాలి సుల్తానాబాద్‌లోని శ్రీ గంగా కాశీ అన్నపూర్ణేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థాన వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా దేశమ్మ తిరునాళ్ల



గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం గొరిగపూడి గ్రామ దేవత దేశమ్మతల్లి తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగింది. అమ్మవారికి పసుపు, కుంకుమలు, చద్ది నైవేద్యాలు సమర్పించుకున్నారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుడిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి రవికుమార్



అమరావతి: అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరుడిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.టి రవికుమార్ గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ, అర్చకులు సుప్రీంకోర్టు న్యాయమూర్తి సి.టి.రవికుమార్ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తి రవికుమార్ దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక న్యాయమూర్తులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్, పది సప్లిమెంటరీ పరీక్షలు


నరసరావుపేటఈస్ట్: ఇంటర్మీడియట్, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ ఒకటో తేదీ వరకు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 26 పరీక్ష కేంద్రాలలో 14,935 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్, వృత్తి విద్యా విద్యార్థులు 10,157మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,778మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్(08647223355) ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎం.నీలావతిదేవి తెలిపారు. 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 23 పరీక్ష కేంద్రాల్లో 6,199మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఆయా కేంద్రాల్లో సీఈలు, డీఓల తోపాటు 300మంది ఇన్విజిలేటర్లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విధుల్లో పాల్గొంటున్నట్లు డీఈఓ తెలిపారు.

దివ్యాంగ చిన్నారులపై ప్రత్యేక దృష్టి



గురజాల: దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించి వారికి కావాల్సిన అవసరాలను తీర్చే విధంగా 40 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. 0 నుంచి 18 ఏళ్ల వయస్సు లోపల ఉన్న పిల్లలను గుర్తించి వారి అవసరాలు తీర్చడానికి ఇది ఎంతో ఉపయోగపడతుందని ఐఈఆర్‌పీలు తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. వారికి అనుగుణంగా చదువులో మంచి ప్రతిభ కనబరిచేలా చూడటం జరుగుతుందన్నారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. గ్రామాల్లో అంగన్ వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో గల సిబ్బందిని ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని తెలుపుతున్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు మాచర్ల విజయలక్ష్మి, ఝాన్సీరాణిలు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 504.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 806.70 అడుగుల వద్ద ఉంది.

మాచర్లలో టెన్షన్..టెన్షన్

- టీడీపీ చలో మాచర్ల పిలుపుతో అప్రమత్తమైన పోలీసులు
- పట్టణంలో మోహరించిన బలగాలు
- విస్తృతంగా తనిఖీలు
- పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు
- ఎస్పీ మలికా గార్గ్ పర్యవేక్షణ



మాచర్ల పట్టణంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

మాచర్ల : టీడీపీ చలో మాచర్లకు పిలుపునివ్వటంతో జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాలతో మాచర్లలో గురువారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు యంత్రాంగంతోపాటు ర్యాపిడ్ ఫోర్స్ బలగాలను రంగంలోకి దింపారు. ఉదయం నుంచి నియోజకవర్గంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. చలో మాచర్లకు అనుమతి లేదని బయటి వ్యక్తులు ఎవ్వరూ రాకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో ఎస్పీ మలికా గార్గ్ నేతృత్వంలో పటిష్ట చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలోని గ్రామాలతో పాటు బయటి ప్రాంతాల నుంచి వ్యక్తులు మాచర్ల రాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ఉదయం నుంచే విస్తృతంగా తనిఖీ చేపట్టారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేసిన తర్వాతనే అనుమతించారు. గుంపులు గుంపులుగా తిరగకుండా చర్యలు తీసుకున్నారు. వ్యాపార, వాణిజ్య దుకాణాలను 10గంటల నుంచి సాయంత్రం వరకు మూసివేయాలని పోలీసులు వ్యాపారులను ఆదేశించారు. ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పల్నాడు జిల్లా పోలీసు అధికారులు మాచర్లలో మకాం వేసి ఎక్కడా ఒక చిన్న సంఘటన జరగకుండా పర్యవేక్షించారు. ముందు జాగ్రత్తగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులను హౌస్ అరెస్టు చేశారు. ఎలాంటి సంఘటనలు జరగకపోవడంతో పోలీసులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

విధ్వంసానికి పక్కా ప్లాన్

- వ్యూహాత్మకంగా బ్రహ్మారెడ్డిని రంగంలోకి దించిన టీడీపీ
- అతనికి ఆర్థికంగా అండదండలు
- జూలకంటి రాకతోనే అల్లర్లు ప్రారంభం
- భయపడుతున్న నియోజకవర్గ ప్రజలు

మాచర్ల: మాచర్ల నియోజకవర్గంలో విధ్వంసానికి టీడీపీ పక్కా ప్రణాళికను రూపొందించింది. దీంతో భాగంగానే ఫ్యాక్షనిస్టు జూలకంటి బ్రహ్మానంద రెడ్డిని నియోజకవర్గానికి తీసుకొచ్చారు. అతను నియోజకవర్గంలో అడుగుపెట్టినది మొదలు గొడవలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో 2004 నుంచి ఇప్పటి వరకు టీడీపీ విజయం సాధించలేదు. నిరాశలో ఉన్న టీడీపీకి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. ప్రజాభిమానాన్ని పొంది పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఈ ఎన్నికలలో ఎలా అడ్డగించాలని ఒక మాస్టర్ ప్లాన్ వేశారు. పిన్నెల్లి హవాను అడ్డగించాలంటే బ్రహ్మారెడ్డి తప్ప ఎవరి వల్ల కాదని భావించి టీడీపీ అధినేత చంద్రబాబు వ్యూహం పన్నారు. ఇందులో భాగంగా ఏడాదిన్నర కిందట బ్రహ్మారెడ్డిని పిలిచి నిన్ను ఇన్‌ఛార్జిగా నియమిస్తా, నీకు అన్ని రకాలుగా పార్టీ అండదండలతోపాటు ఆర్థిక సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అక్కడే కథ మొదలైంది. అప్పటి నుంచి మొదటగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన కారంపూడి మండలం నుంచి నియోజకవర్గంలోకి ప్రవేశించారు. ఆ రోజే పిన్నెల్లికి సంబంధించిన ఒక వ్యాపార సంస్థ ముందు ఈలలు వేసి రెచ్చగొట్టే విధంగా వ్యవహరించారు. అక్కడ నుంచి జూలకంటి ప్రతి గ్రామంలో పర్యటిస్తూ మీకెందుకు నేనున్నా గొడవలు పెట్టుకోండి మనకు పైనుంచి డబ్బులు వస్తాయంటూ రెచ్చగొట్టారు. ప్రతి గ్రామంలో చిచ్చురేపారు. ఏ చిన్న గొడవ జరిగినా అది అధిష్టానానికి తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడులో చంద్రయ్య హత్యను హైలెట్‌గా చిత్రీకరించారు. జంగమహేశ్వరపాడులో గొడవ సృష్టించి పారిపోయిన వ్యక్తికి మద్దతు పలికాడు. అక్కడ నుంచి వెల్దుర్తి, బోదిలవీడు, శిరిగిరిపాడు, లోయపల్లితోపాటు అనేక గ్రామాల్లో విధ్వంసాలకు తెరతీశాడు. కారంపూడి మండలం ఒప్పిచర్ల, ఓబులేశునిపల్లె, చింతపల్లి, పేటసన్నిగండ్లలో, రెంటచింతల మండలంలోని తుమ్మకోట, పాలవాయి గేటుతోపాటు అనేక కమ్మ సామాజిక వర్గానికి చెందిన గ్రామాలకు వెళ్లి ఈసారి మనదే గెలుపంటూ ఈసారి వారిని ఉసిగొలిపి గొడవలు చేయించారు. ప్రతి గొడవకు పీఆర్కే కారణమంటూ ప్రచారం చేయించారు. ప్రతి రోజూ ఎల్లో మీడియాలో పీఆర్కే మీద బురదచల్లుతూ ప్రెస్ మీట్లు పెట్టి నానా రచ్చ చేశారు. అనేక గ్రామాలలో రచ్చను పెంచిన ఆయన ఎంపీ అభ్యర్థి లావు కృష్ణదేవరాయలు మద్దతు వచ్చాక మరింత రెచ్చిపోయారు. ఎన్నికల ముందు రోజు నుంచి ఒక పథకం ప్రకారం గొడవలు సృష్టించారు. అందులో భాగంగానే పాలవాయి గేటులో బీభత్సం, తుమ్మకోటలో ఈవీఎంల ధ్వంసం, జెట్టిపాలెంలో ఘర్షణ, గుండ్లపాడులో ఒక వైపు వ్యవహరించేలా ఒక వర్గాన్ని ప్రోత్సహించారు. సొంతూరైన వెల్దుర్తిలో రిగ్గింగ్ చేసుకొని కండ్లకుంట, కొత్తపుల్లారెడ్డిగూడెంలో సంబంధం లేని ఇద్దరిని కూర్చోబెట్టి రగడకు ప్రయత్నించారు. ఇదంతా తమకు అనుకూలమైన పోలీసులతో కలిసి ముందుగానే సిద్ధం చేసుకొన్నారు. మాచర్ల మండలం కొత్తపల్లి, అలుగురాజుపల్లి, కంభంపాడు, రాయవరం గ్రామాలలో అలజడులు సృష్టించారు. అన్నీ చోట్ల టీడీపీ ఆధిపత్యం కోసం ప్రయత్నించారు. హింసాత్మక ఘటనల నేపథ్యంలో పోలీసులు నియోజకవర్గ వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. దీంతో వ్యాపారులతోపాటు అన్నీ వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పటి ఎస్పీపై ఎన్నికల సంఘం వేటు వేసి కొత్త ఎస్పీని నియమించడంతో పరిస్థితిని అదుపులోకి వచ్చింది. రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు పక్కా ప్రణాళిక

రాష్ట్ర ఎన్నికల అధికారికి నివేదించిన జిల్లా ఎన్నికల అధికారి



కౌంటింగ్ కేంద్రం వద్ద మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్, ఎస్పీ మలికా గార్గ్

నరసరావుపేట: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపునకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామంటూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్ నివేదించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా గురువారం ఓట్ల లెక్కింపుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీక్షణ సమావేశానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లను ఆయనకు వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానకార్యదర్శి సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలు, నిబంధనల మేరకు టేబుల్స్ ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, టేబుల్స్ ఏర్పాటుపై ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా స్ట్రాంగ్ రూముల భద్రత, సీసీ కెమెరాల నిఘా ఉండాలన్నారు. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థుల సమక్షంలో పారదర్శకంగా ఓట్ల లెక్కింపు జరగాలన్నారు. ప్రతి అంశాన్ని వీడియోగ్రఫీతో చిత్రీకరించాలని ఆయన సూచించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఓట్ల లెక్కింపు సిబ్బంది నియామకం, బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

నరసరావుపేటరూరల్: ఎన్నికల కోడ్, సెక్షన్ 144 సీఆర్‌పీఎస్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్, జిల్లాఎస్పీ మలికా గార్గ్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు కేటాయించిన జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్, జిల్లాఎస్పీ మలికా గార్గ్‌లు ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కౌంటింగ్‌కు వచ్చే సిబ్బంది, ఏజెంట్లు, అభ్యర్థులు నిర్దేశించిన ప్రాంతంలో తమ వాహనాలను నిలిపి కేంద్రానికి రావాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి ఊరేగింపులకు అనుమతి లేదని తెలిపారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాల్లో, ముఖ్య కూడళ్లలో పోలీస్ బలగాలతో పికెట్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నలుగురు కన్నా ఎక్కువ మంది ఒకే చోట గుమ్మికూడరాదని, బహిరంగసభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెట్రోల్ బంక్‌ల్లో వాహనాల్లో మాత్రమే పెట్రోల్, డీజిల్ నింపాలని, ఏ ఇతర బాటిల్స్‌లో పోయరాదని తెలిపారు. పెట్రోల్ బంక్ యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు, బాధ్యతగా వ్యవహరించి పోలీసులతో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) రాఘవేంద్రరావు, డీఎస్పీ సుధాకరరావు, ఎస్‌బీ సీఐ సురేష్‌బాబు, రూరల్ సీఐ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ పరిధిలో డ్రోన్ల ఎగురవేత నిషేధం

నరసరావుపేట: నరసరావుపేట పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించే జేఎన్టీయూ కాలేజ్ పరిధి కాకాని మండలంలో మానవ రహిత డ్రోన్లను ఎగురవేయుట నిషేధిత ప్రాంతంగా గుర్తించామని జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బి.లత్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో మానవ రహిత డ్రోన్లు ఎగురవేత నిషేధమని, నిబంధన అతిక్రమించి డ్రోన్లను ఎగరవేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఊరిలోనే ఉపాధి

- జిల్లాలో ఈ ఏడాది లక్ష్యం 45 లక్షల పనిదినాలు
- ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభమైన ఆర్థిక సంవత్సరం
- జిల్లాలో 3.20 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ కూలీలకు గరిష్ట వేతనం రూ.300



యడవల్లి గ్రామంలో పంట కుంటల పనుల్లో ఉపాధి కూలీలు

సత్తెనపల్లి: వలస వెళ్లకుండా ఉన్న ఊర్లోనే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం ఉపాధి కల్పిస్తోంది. కొలతల ప్రకారం పని చేయించి గిట్టుబాటు వేతనం ఇస్తోంది. జిల్లాలో 3.20 లక్షల జాబ్ కార్డు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 5.50 లక్షల మంది కూలీలు ఉన్నారు. 2.52 లక్షల కుటుంబాల్లోని 4.32 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభం కాగా ఈ ఏడాది జిల్లాలో 45 లక్షల పనిదినాలను లక్ష్యంగా చేసుకున్నారు. ఇందుకోసం రూ.225 కోట్ల లేబర్ (కూలీల వేతనం, మెటీరియల్ కలిపి) బడ్జెట్ కేటాయించారు. ఈ నిధులు పంట కాలవలు, పంట కుంటలు, చెరువుల్లో పూడిక తీత, నీటి సంరక్షణ, ఉద్యాన శాఖ పరిధిలో మామిడి, నిమ్మ, సపోటా, జామ తదితర పండ్ల తోటల పెంపకం పనులకు ఖర్చు చేయనున్నారు.

కొనసాగుతున్న ఉపాధి పనులు

జిల్లాలోని 28 మండలాల్లో 530 గ్రామాలు ఉండగా 525 గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది నుంచి కూలీలకు రోజుకు రూ.300 గరిష్ట వేతనం కాగా రోజుకు రూ.248.19 సగటు వేతనం అందుతుంది. ఒక్కో చోట చేసిన పనిని బట్టి కొలతల ఆధారంగా రూ.290 వరకు అందుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో 5,545 పనులు ప్రారంభించగా 110 పనులు పూర్తయ్యాయి. 20,280 కుటుంబాలు 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్నాయి. వీటిలో అత్యధికంగా సత్తెనపల్లి మండలంలో 1,946 కుటుంబాలు 100 రోజులు పని పూర్తి చేసుకున్నాయి. ఈ ఏడాది 25 వేలకు పైగా కుటుంబాలకు 100 రోజులు పని కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలోని 4 క్లస్టర్ల వారీగా ఇప్పటి వరకు కల్పించిన పనులు

క్లస్టర్	పనిదినాలు	చేసిన పనిదినాలు	శాతం
గురజాల	13,62,548	10,11,088	74.21
నరసరావుపేట	7,44,439	6,35,425	85.36
సత్తెనపల్లి	14,06,738	12,82,147	91.14
వినుకొండ	9,86,276	8,86,770	89.91
మొత్తం	45,00,000	38,15,430	84.79

ఊపందుకున్న పనులు

ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెల నుంచి ఉపాధి పనులు ఊపందుకున్నాయి. వేసవిలో పంట కుంటలు, చెరువుల్లో పూడికతీత వంటి పనులు అధికంగా చేపట్టారు. ఏప్రిల్ నుంచి పనులు చేసే ఉపాధి కూలీల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఖరీఫ్ పనులు పూర్తిస్థాయిలో మొదలయ్యే వరకూ ఉపాధి హామీ పనులు జోరుగా సాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

కూలీలకు అదనపు సౌకర్యాలు

ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం 5.30 గంటలకు పనులు ప్రారంభించి ఉదయం 10:30 గంటలకు ముగించుకుంటున్నారు. అయినప్పటికీ ఎండ బారిన పడకుండా ఉపాధి కూలీలకు టెంట్లు వేయిస్తున్నారు. తాగునీటి సదుపాయం కల్పిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు.

చేతినిండా పని దొరుకుతుంది



మా గ్రామంలో చేతి నిండా పని దొరుకుతుంది. వ్యవసాయ పనులతోపాటు ఉపాధి హామీ పనులు అందుబాటులో ఉండడంతో ప్రతి రోజూ పనులకు వెళుతున్నా. రూ.270 నుంచి రూ.290 వరకు కూలి పడుతుంది. నేను 40 రోజులు ఉపాధి పనులకు వెళ్లా.

–కోండ్రు లాజర్, ఉపాధి కూలీ, ధూళిపాళ్ల

ఉపాధి పనులు కల్పిస్తున్నారు



పనులకు ఎక్కడికో వెళ్లే పని లేకుండా మా ఊర్లోనే ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తున్నారు. నేను, నా భర్త ఇద్దరం ఉపాధి పనులకు వెళుతున్నాం. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు కల్పించడంతో మా లాంటి వారికి ఎంతో ఉపయోగం. 80 పని దినాలు వినియోగించుకున్నాం

–తుపాకుల మాధవి, ఉపాధి కూలీ, ఫణిదం

ప్రణాళికాబద్ధంగా పనులు



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఏప్రిల్ ఒకటి నుంచి ఉపాధి కూలీల దినసరి వేతనాన్ని రూ. 272 నుంచి రూ.300కు ప్రభుత్వం పెంచింది. దీంతో కూలీలకు ఉపాధి గిట్టుబాటు అవుతుంది. వేసవిలో ప్రణాళికాబద్ధంగా ప్రతి ఒక్కరికి పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం. గ్రామాల్లో స్థానిక అవసరాల మేరకు ఉపాధి పనులు గుర్తిస్తున్నాం. ఉపాధి హామీ పనులు చేసేందుకు కూలీలు కూడా ఆసక్తి చూపుతున్నారు.

–జి జోసఫ్‌కుమార్, డ్వామా పీడీ, పల్నాడు

బీసీజీ టీబీ టీకాకు విశేష స్పందన



మహిళకు బీసీజీ టీబీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: 18 ఏళ్లు పైబడిన వారికి ఆరు కేటగిరీల్లో 12 జిల్లాల్లో కొనసాగుతున్న బీసీజీ టీబీ టీకాకు విశేష స్పందన లభించిందని రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ తాళ్లూరి రమేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,24,964 మందికి ఈ టీకాలు వేశామన్నారు. గురువారం ఆయన గుంటూరులోని పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ) పరిధిలో గోరంట్ల, మల్లికార్జున పేట, నాజ్ సెంటర్, గుంటూరువారితోట, ఓల్డ్ గుంటూరు, ఐపీడీ కాలనీ, లాంచెస్టర్ రోడ్, శ్రీనివాసరావు తోట తదితర ప్రాంతాల్లో బీసీజీ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వెనుకబడి ఉందని, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది మరింత అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ప్రతి గురువారం రోజు ఈ టీకాను వేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ఆయా జిల్లాలకు నియమితులైన నోడల్ ఆఫీసర్లు టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారన్నారు. 12 జిల్లాల్లో బీసీజీ టీబీ టీకాను ఈనెల 16న ప్రారంభించామని, ఆ రోజు 1,71,507 మందికి బీసీజీ టీబీ టీకాను వేశామన్నారు. విజయనగరం, వైఎస్సార్ కడప, చిత్తూరు, ఎస్.ఎ స్.పి.నెల్లూరు, సత్యసాయి, కృష్ణా, నంద్యాల, పల్నాడు, విశాఖపట్నం, అన్నమయ్య, గుంటూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఇప్పటి వరకు ఈ టీకాలు వేశామని డాక్టర్ రమేష్ తెలిపారు.

ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించాలి



గుంటూరుఎడ్యుకేషన్: జూన్ 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు విజ్ఞప్తి చేసినట్లు గుంటూరుకు చెందిన అవర్ స్టేట్, అవర్ లీడర్ – వైఎస్సార్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి తెలిపారు. ఈమేరకు గురువారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖేష్‌కుమార్ మీనాను కలిసిన ఫోరం సభ్యులు ప్రవీణ్, లక్ష్మీనారాయణరెడ్డి వినతి పత్రం సమర్పించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. కౌంటింగ్ రోజున పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న 144 సెక్షన్

మాచర్ల: పోలింగ్ సందర్భంగా నియోజకవర్గంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో విధించిన 144 సెక్షన్ మాచర్ల నియోజకవర్గంలో గురువారం కూడా కొనసాగింది. అందులో భాగంగా ప్రముఖ నాయకులందరినీ హౌస్ అరెస్టు చేశారు. నాయకులు బయటకు రాకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. పోలీసు అధికారులు పలువురిని అదుపులోకి తీసుకొని, అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. ఎటుచూసినా పోలీసు పహారాలో మాచర్ల నియోజకవర్గమున్నది. ఐజీ, ఎస్పీ, డీఎస్పీ అధికారులతోపాటు సీఐలు, ఎస్ఐలు వందలాది మందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

500 మందిపై బైండోవర్ కేసుల నమోదు

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 500 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు గురువారం పేర్కొన్నారు. వీరిలో కొంత మంది ఎన్నికలకు సంబంధం ఉన్న కేసుల్లో కూడా ఉన్నారన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముప్పాళ్లలో 11 మందికి బాండ్స్ అమౌంట్ చెల్లించమని తహసీల్దార్ నోటీసులు జారీ చేశారన్నారు. రాజుపాలెంలో ఐదుగురికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిపై రౌడీషీట్స్ ఓపెన్ చేయనున్నట్లు వెల్లడించారు. మరికొందరిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసేందుకు పోలీసు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలియజేశారు. గొడవలను ప్రోత్సహించినా చేసినా వారిపై కఠినమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

42 మంది అరెస్టు

పిడుగురాళ్ల: ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గొడవలకు దిగిన రాజకీయపార్టీలకు చెందిన ముఖ్యులను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపారు. మండలంలోని పెద అగ్రహారం గ్రామానికి చెందిన ఇరుపార్టీలకు చెందిన 30 మంది, కరాలపాడు గ్రామానికి చెందిన 12 మంది మొత్తం 42 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరిని రాజమండ్రి సెంట్రల్ జైలు, నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా ఓట్ల లెక్కింపు రోజున గొడవలకు, అల్లర్లకు పాల్పడితే అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకొని వారిని కూడా రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించనున్నట్లు తెలిపారు.

నవరసభరితంగా సంగీత నాట్య పోటీలు


కేరళ రాష్ట్రం పెరావూర్‌కు చెందిన నియాసందీప్ చిరుతముత్తి ప్రదర్శన


అనంతపురానికి చెందిన జి నాగచిన్మయి తుమ్మెదలున్నాయేమిరా ప్రదర్శన


ప్రొద్దుటూరుకు చెందిన ఆర్ దివ్య నందిని పారేగోదావరి ప్రదర్శన


ఆర్మూరుకు చెందిన డి తన్వి కొండల్లో కోనల్లో ప్రదర్శన


ఆర్మూర్‌కు చెందిన జి మృదుల మొక్కజొన్నతోటలో ప్రదర్శన

- ఉర్రూతలూగించిన జానపద నృత్యాలు
- మూడో రోజు కొనసాగిన కళానిలయం జాతీయ స్థాయి సంగీత నాట్యపోటీలు

చిలకలూరిపేట: పురివిప్పిన నెమలిని తలపించే నృత్యాలు..మనసును పులకింపచేసే కీర్తనలు..సుమధుర గీతాలు...ఉర్రూతలూగించే జానపద నృత్యాల నడుమ కళానిలయం 39వ జాతీయస్థాయి నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్య కళారూపాల పోటీలు గురువారం మూడో రోజు కొనసాగాయి. పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కొనసాగుతున్న ఈ పోటీలలో చివరిరోజు వివిధ అంశాలలో కళాకారులు ఉత్సాహంగా పాల్గొని కళారూపాలను ప్రదర్శించారు. మూడో రోజు పోటీలను కళానిలయం నిర్వాహకుడు ప్రగడ రాజమోహనరావు సతీమణి శివసత్యనారాయణమ్మ నటరాజపూజ చేసి ప్రారంభించారు. సూర్య, చంద్ర విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలలో జానపద నృత్యాలతోపాటు శాస్త్రీయ బృందనాట్యాలు, శాస్త్రీయ జంటనాట్యాలు, శాస్త్రీయం కాని జంటనాట్యాలు, శాస్త్రీయ కాని బృందనాట్యాలు, శాస్త్రీయ నృత్య నాటికలు ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తుమ్మెదలున్నాయేమిరా, చిరుతముత్తి, పారేగోదావరి, నా పేరు మల్లిగాడు, పోమతి పొన్నమ్మ, ఓరి మగడా వంటి జానపద నృత్యాలతో పాటు, శ్రీకృష్ణ తరంగిణి, సారూప్యం, దేవిస్తుతి, కాళింగనర్తనం, శ్రీకృష్ణలీలలు, గోవర్ధనం వంటి బృందనాట్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా జానపద నృత్యాలు రసజ్ఞులైన ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. నాట్యాచార్యులకు సన్మానాలు నిర్వహించారు. ప్రేక్షకులు ఆసక్తిగా ప్రదర్శనలను వీక్షించారు.

వైభవంగా శ్రీరంగనాథస్వామి కల్యాణ మహోత్సవం


శ్రీరంగనాథస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: మాచర్ల మండలం అనుపులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణానికి ముందుగా శ్రీదేవి, భూదేవి, శ్రీరంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు జరిపారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులను ఆలయ అర్చకులు కురుమేటి దత్తాత్రేయశర్మ, కురుమేటి దత్తకుమార్‌శర్మ, శ్రీపాద సుబ్రహ్మణ్యశర్మ, రాజశేఖర్‌శర్మ తదితరులు వేదమంత్రాలతో ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపైకి తోడ్కొని వచ్చారు. అనంతరం శ్రీదేవి, భూదేవి ఎదురుగా శ్రీరంగనాథస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆయా గ్రామాల నుంచి భక్తులు ప్రభలను అలంకరించి మేళతాళాలతో అనుపు రంగనాథస్వామి దేవాలయానికి తీసుకువచ్చారు. ఆలయంలో ఉదయం స్వామి వారి అలంకరణ, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, నవగ్రహారాధన, ఎదురుకోలా, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగార్జున కొండ కన్జర్వేటివ్ అసిస్టెంట్ యు వెంకటయ్య, రిటైర్ట్ ఇన్‌కంటాక్స్ కమిషనర్ స్వామి నాయక్ పాల్గొన్నారు.


కారెంపూడి బస్టాండ్ సెంటర్


మూతపడిన షాపులు

నిర్మానుష్యంగా కారెంపూడి

కారెంపూడి: కారెంపూడిలో గురువారం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. పది రోజులుగా అమలులో ఉన్న 144 సెక్షన్ కొనసాగుతుంది. కారెంపూడి పూర్తిగా పోలీస్ పహారాలో ఉంది. ఉదయం కొద్ది సమయం ప్రజలు నిత్యావసరాలు కొనుగోలు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఆ తర్వాత మళ్లీ యథావిధిగా షాపులన్నీ మూతపడ్డాయి. కారెంపూడితో పాటు మండలంలోని అన్ని గ్రామాలపై పోలీస్ నిఘా యథావిధిగా కొనసాగింది. వైఎస్సార్‌సీపీ, టీడీపీ పార్టీలకు చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఎవరూ కూడా బహిరంగంగా తిరగడం లేదు, చాలా మంది గ్రామాలు విడిచి వేరే గ్రామాలలో తలదాచుకున్నారు. ముఖ్యంగా గురువారం మండలంలో టెన్షన్ వాతావరణం కొనసాగింది. అవాంఛనీయ ఘటనలు జరగలేదు. వ్యాపారులు కూడా స్వచ్ఛందంగా షాపులు మూసివేశారు. ప్రభుత్వ కార్యాలయాలు నామమాత్రంగా పని చేశాయి.

పులిచింతల నిర్వాసిత కేంద్రంలో తనిఖీలు


నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎస్ఐ బాషా

రాజుపాలెం: రాజుపాలెంలోని పులిచింతల నిర్వాసిత కేంద్రంలో పోలీసు అధికారులు గురువారం రాత్రి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నిర్వాసిత కేంద్రంలోని ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. గేదెల కొష్టాలలో, గడ్డివాముల్లోను, దొడ్లలోను సోదలు నిర్వహించారు. ఎలాంటి మారణాయుధాలు, మందుగుండు సామాగ్రి దొరకలేదు. ఎస్ఐ షమీర్‌బాషా కాలనీ వాసులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓట్ల లెక్కింపు రోజు శాంతియుతంగా ఉండాలని, ఊరేగింపులు, టపాసులు పేలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసు వారికి సహకరించాలని కోరారు. ఆయన వెంట ఏఎస్ఐ కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాతగుంటూరులో భారీ అగ్ని ప్రమాదం



పట్నంబజారు: గుంటూరు నగరంలోని పాతగుంటూరు, సుద్దపల్లి డొంక శివారు ప్రాంతమైన ప్రగతి నగర్ సమీపంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి సంబంధించి ప్లాస్టిక్ పైపులు నిల్వ ఉంచిన ఓ కంపెనీలో గురువారం మధ్యాహ్నం సమయంలో మంటలు చెలరేగాయి. సుమారు రూ. 2 కోట్ల విలువ చేసే ప్లాస్టిక్ పైపులు దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. అయితే ప్రమాదకారణం తెలియరాలేదు. అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా నల్లటి పొగ కమ్మేసింది. స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సుమారుగా 40 లాట్‌లు వరకు పైపులు తగలబడినట్లు అధికారులు తెలిపారు. షాపుంజీ పల్లోంజీ కంపెనీకి సంబంధించిన కాంట్రాక్టు పనులకు చెందిన పైపులు దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు.

రెచ్చిపోయిన టీడీపీ గూండాలు

- దీపాలదిన్నెపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తపై మూకుమ్మడి దాడి
- కారుకు పోలీసు సైరన్‌తో గ్రామంలో హల్‌చల్
- మాదిగ నా కొడుకులు అంటూ దూషణలపర్వం


సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స పొందుతున్న చిలుకా ఏసుబాబు

సత్తెనపల్లి: పోలింగ్ ముగిసి పది రోజులవుతున్నా టీడీపీ గూండాలు ఇంకా రెచ్చిపోతూనే ఉన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ దాడులకు తెగబడుతున్నారు. సత్తెనపల్లి మండలం దీపాలదిన్నెపాలెంలో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓటు వేశారన్న అక్కసుతో గ్రామానికి చెందిన చిలుకా ఏసుబాబుపై గ్రామానికి చెందిన టీడీపీ రౌడీలు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. దేవరపల్లి లక్ష్మీనారాయణ, దేవరపల్లి శేఖర్, ప్రదీప్, వంశీలతో మరో ఏడుగురు గుంటూరుకు చెందిన వ్యక్తులు కారులో పోలీస్ సైరన్ వేసుకొని సాయంత్రానికి గ్రామానికి వచ్చి ఒంటరిగా ఉన్న ఏసుబాబుపై విచక్షణ రహితంగా దాడి చేశారు. దీంతో ఏసుబాబు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళనలు నెలకున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఏసుబాబు కుటుంబ సభ్యులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసులకు చెప్పినా స్పందించలేదు. దీంతో ఏసుబాబును సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరువాత మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఏసుబాబు బంధువులు మాట్లాడుతూ 'మాదిగ నా కొడకల్లారా మీ అంతు తేలుస్తామంటూ' కులం పేరుతో దూషించి విచక్షణ రహితంగా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 4న ఫలితాలు వచ్చాక మీ అందరి అంతు తేలుస్తామంటూ మహిళలని కూడా చూడకుండా చెప్పటానికి వీలు లేని భాషలో దూషించారన్నారు. 4న ఫలితాలు వచ్చాక ఏసుబాబును తాళ్ళు కట్టి బావిలో దించుతామంటూ హెచ్చరికలు చేసి వెళ్లారని పేర్కొన్నారు.

వేర్వేరు దాడి కేసుల్లో 33 మంది అరెస్ట్

దాచేపల్లి : మండలంలోని తంగెడ గ్రామంలో జరిగిన దాడి ఘటనలో 33 మంది నిందితులను అరెస్ట్ చేశామని సీఐ ఎ.సురేంద్రబాబు గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ నాయకులు కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దాడికి పాల్పడిన 11 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలను గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అదే విధంగా మరో ఘటనలో 22 మందిని కూడా అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

భార్యను కొట్టి చంపిన భర్త



గుంటూరు రూరల్: విలాసాలకు, మత్తు పదార్థాలకు అలవాటుపడిన ఓ వ్యక్తి తనకు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో భార్యను కొట్టి హత్య చేసిన ఘటన నగరంలోని స్వర్ణభారతి నగర్‌లోని ఐద్వానగర్‌లో జరిగింది. నిందితుడిని నల్లపాడు పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐద్వానగర్‌కు చెందిన జాతావత్ అశోక్‌నాయక్‌కు, స్థానికంగా ఉండే ఆశాభాయి(25)తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో అశోక్‌నాయక్ పలుమార్లు ఆశాభాయిపై దాడిచేసి డబ్బులు కావాలని హింసించేవాడు. తాగుడు, వ్యసనాలకు బానిసై భార్యను చిత్రహింసలకు గురిచేసేవాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఆశాభాయిను డబ్బులు కావాలని అడగ్గా ఆమె నిరాకరించింది. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఆవేశంతో అశోక్ ఆశాభాయిని తీవ్రంగా కొట్టాడు. తీవ్రగాయాలతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. స్థానికులు, బంధువులు ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందిందని తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారించి కోర్టుకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.